క్లుప్తంగా

సమ్మర్ క్యాంప్‌లో క్రాఫ్ట్ పోటీలు



క్రాఫ్ట్ పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్న చిన్నారులు

తాళ్లరేవు: స్థానిక ప్రజా సంఘాల భవనంలో చిల్డ్రన్స్ క్లబ్ సమ్మర్ క్యాంప్‌లో భాగంగా శనివారం చిన్నారులకు క్రాఫ్ట్ పోటీలు నిర్వహించారు. పోటీల్లో చిన్నారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. చిన్నారులు రంగు రంగుల పేపర్లతో తయారుచేసిన వివిధ రకాల వస్తువులు అందరినీ ఆకట్టుకున్నాయి. వేసవి శిక్షణ శిబిరంలో అనేక అంశాలపై చిన్నారులకు అవగాహన కల్పిస్తున్నట్లు నిర్వాహకులు గుత్తుల మల్లేశ్వరరావు తెలిపారు.

కౌంటింగ్ అబ్జర్వర్‌గా రాకేష్ కుష్‌రే

యానాం: ఈ నెల 4న నిర్వహించే ఓట్ల లెక్కింపు ప్రక్రియకు కౌంటింగ్ అబ్జర్వర్‌గా రాకేష్ కుష్‌రేను ఎన్నికల కమిషన్ నియమించిందని అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి, ఆర్‌ఏఓ మునిస్వామి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక ఎస్ఆర్‌కే ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆయన లెక్కింపు ప్రక్రియను పరిశీలించనున్నారన్నారు. ఆయన ఈ నెల 2వ తేదీ ఆదివారం స్థానిక ప్రభుత్వ అతిథి గృహం వద్ద అందుబాటులో ఉంటారన్నారు.

విస్తృతంగా వాహన తనిఖీలు



సుంకరపాలెం జంక్షన్‌లో వాహనాలను తనిఖీ చేస్తున్న కోరంగి ఎస్ఐ రవికుమార్ బృందం

తాళ్లరేవు: జాతీయ రహదారి 216లోని సుంకరపాలెం జంక్షన్, చొల్లంగి గ్రామాల్లో కోరంగి ఎస్ఐ ఎస్.రవికుమార్ నేతృత్వంలో పోలీసులు విస్తృత తనిఖీలు నిర్వహించారు. తనిఖీల్లో సరైన ధ్రువపత్రాలు లేని వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ఓట్ల లెక్కింపు రోజున ఎవరైనా వాహనాలపై రహదారిపైకి వచ్చి విన్యాసాలు చేస్తే వారిపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. వాహనదారులు విధిగా తమ వద్ద ధ్రువపత్రాలను ఉంచుకోవాలని సూచించారు. తనిఖీల్లో కానిస్టేబుళ్లు సురేష్, శ్రీనివాస్ తదితరులున్నారు.

వ్యాన్ బోల్తా



బోల్తా పడిన వ్యాన్

ముమ్మిడివరం: కాకినాడ నుంచి అమలాపురం వైపు ఐస్ లోడ్‌తో వెళుతున్న వ్యాన్ శనివారం ముమ్మిడివరం నగర పంచాయతీ పరిధిలోని కాశివాని తూము సెంటర్ వద్ద మోటారు బైక్‌ను తప్పించబోయి అదుపు తప్పి బోల్తా పడింది. ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది.

వీరభద్రస్వామికి బూరెలతో నైవేద్యం

అమలాపురం రూరల్: మండలంలోని బండారులంకలో భద్రకాళీ సమేత వీరభద్రస్వామి ఆలయ వార్షికోత్సవం శనివారం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా గ్రామస్తులు స్వామివారికి బూరెలతో నైవేద్యం సమర్పించారు. పుత్సల వీరభద్రయ్య దంపతులు కర్తలుగా మాడా వాసు ఆధ్వర్యంలో వీరభద్ర స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం హనుమాన్ జయంతి సందర్భంగా తమలపాకుల పూజ, సింధూర పూజ నిర్వహించారు. శ్రీశైలం మాజీ ట్రస్టీ చింతా శంకరమూర్తి, చంద్రకళ దంపతులు స్వామివారికి నూతన వస్త్రాలు సమర్పించారు. పూజా కార్యక్రమాల్లో మాజీ ఎంపీపీ వుటూకురి సుబ్రహ్మణ్యస్వామి, లక్కింశెట్టి నాగ మల్లేశ్వరరావు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

విజ్ఞానదాయక అంశాలను నేర్చుకోవాలి



బాలల వేసవి వినోద కేంద్రంలో మాట్లాడుతున్న ప్రధానోపాధ్యాయుడు త్రిమూర్తులు

తాళ్లరేవు: బాలలు విజ్ఞానదాయకమైన అంశాలను నేర్చుకోవడం ద్వారా శాస్త్రీయ దృక్పథంతో ఏర్పడుతుందని గిరియాంపేట పెరుంతలై వార్ ప్రభుత్వ హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు దంగేటి త్రిమూర్తులు పేర్కొన్నారు. శనివారం స్థానిక నీలపల్లి జెడ్పీ హైస్కూల్‌లో జనవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో బాలల వేసవి వినోద కేంద్రాన్ని ప్రారంభించారు. శిబిరంలో మూడో తరగతి నుంచి పదో తరగతి వరకూ చదివే బాలలకు సైంటిఫిక్ మ్యాజిక్, కర్రసాము, చిత్రలేఖనం, ఇంద్రజాల ప్రదర్శన, ఫన్‌మాథ్స్, స్పోకెన్ ఇంగ్లిష్, క్విజ్ తదితర అంశాలను నేర్పిస్తున్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఇళ్ల సాయిబాబా, కాశి కరుణ తదితరులు పాల్గొన్నారు.



ప్రత్యేక అలంకరణలో ముమ్మిడివరం అభయాంజనేయ స్వామి



హనుమాన్ అలంకారంలో చొల్లంగి సోమేశ్వరస్వామి



ఉప్పలగుప్తంలో ప్రత్యేక అలంకరణలో అభయాంజనేయస్వామి



కొమరగిరిపట్నంలో పండ్ల అలంకరణలో మృత్యుంజయ్ హనుమాన్



అమలాపురంలో 108 అరటి మొక్కల నడుమ హనుమాన్ జయంతి పూజలు

శ్రీఆంజనేయం.. ప్రసన్నాంజనేయం

ముమ్మిడివరం: మండలంలోని ఆంజనేయస్వామి ఆలయాల్లో హనుమాన్ జయంతిని శనివారం అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ముమ్మిడివరంలోని శ్రీఅభయాంజనేయ స్వామి ఆలయం వద్ద ఆలయ అర్చకులు విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం, అమృత మండపారాధన, సింధూర అర్చన, శాంతి హోమం వంటి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం రామ రక్ష సూత్రం పారాయణ నిర్వహించారు. క్రాప చింతలపూడి రాయుడుపాలెం, కొమానపల్లి, గాడిలంక, ముమ్మిడివరం పెద్ద వంతెన వద్ద ఉన్న ఆంజనేయ స్వామివారి ఆలయాల్లో హనుమాన్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భారీ అన్న సమారాధన జరిగింది. అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చి స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

తాళ్లరేవు: హనుమజ్జయంతి పర్వదినం సందర్భంగా మండల పరిధిలోని అన్ని హనుమాన్ ఆలయాల్లోనూ స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఆలయాలను సర్వాంగ సుందరంగా ముస్తాబు చేసారు. శనివారం తెల్లవారుజాము నుంచి ఆంజనేయుని ఆలయాలకు భక్తులు పోటెత్తారు. స్వామివారి విగ్రహాలకు నిమ్మకాయలు, తమలపాకులు, గారెల దండలను వేసి పూజించారు. అలాగే పాలు, పెరుగు, పంచామృతాలు, పండ్ల రసాలతో స్వామివారిని అభిషేకించారు. అనంతరం స్వామివారికి వివిధ రకాలైన వంటకాలు, పండ్లతో నైవేద్యం సమర్పించారు. జాతీయరహదారి 216లోని సువర్చల సమేత అభయాంజనేయస్వామివారి ఆలయానికి యానాం ఆర్ఎస్ఎస్, విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో శోభాయాత్ర నిర్వహించారు. అలాగే కార్యసిద్ధి అభయాంజనేయస్వామివారి ఆలయం వద్ద భారీ అన్నదానం చేశారు. చొల్లంగిలో చంద్ర ప్రతిష్ఠిత లింగమైన రాజరాజేశ్వరి సమేత సోమేశ్వరస్వామివారిని హనుమంతుని అలంకారంలో అలంకరించి పూజలు చేశారు.



ఎదుర్లంకలో ఆంజనేయస్వామి జయంతి ఉత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే పొన్నాడ సతీష్‌కుమార్ దంపతులు

ఐ.పోలవరం: మండలంలోని అన్ని గ్రామాల్లో ఉన్న హనుమాన్ విగ్రహాల వద్ద శనివారం హనుమాన్ జయంతి ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరిగాయి. మురమళ్ల, ఐ.పోలవరం, తిళ్లకుప్ప, ఎదుర్లంక, పాతయింజరం, కొమరగిరి, జి.వేమవరం, జి.మూలపొలం, పశువుల్లంక తదితర గ్రామాల్లో ఉన్న ఆలయాలకు అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చి పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఎదుర్లంకలో నూతనంగా నిర్మించిన 70 అడుగుల పంచముఖ ఆంజనేయస్వామి విగ్రహం వద్ద స్థానిక ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ దంపతులు, స్థల దాత భూపతిరాజు బులిరాజు దంపతులు, పితాని బాలకృష్ణ తదితరులు ఆంజనేయ స్వామికి పూజలు చేశారు.

ఉప్పలగుప్తం: మండల కేంద్రం ఉప్పలగుప్తం గ్రామంలో ఉన్న అభయాంజనేయ స్వామి ఆలయంలో హనుమాన్ జయంతి వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. పండితులు భైరవభట్ల సూర్యనారాయణ శర్మ శైవాగమన పద్ధతిలో గణపతి పూజ, పుణ్యాహవచనం, నవగ్రహ మండపారధన చేసి అభయాంజనేయ స్వామికి సింధూర పూజ, తమలపాకుల పూజ నిర్వహించారు. స్వామివారిని ప్రత్యేకంగా అలకరించారు. అనంతరం అన్నసమారాధన నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

అమలాపురం టౌన్: స్థానిక యర్రమిల్లివారి వీధిలోని శక్తి చైతన్య యంత్ర పూర్వక సకల కార్యసిద్ధి మరకత హనుమాన్ మందిర్ వద్ద హనుమాన్ జయంతి కార్యక్రమం శనివారం వైభవంగా జరిగింది. హనుమాన్ విగ్రహం వద్ద 108 అరటి మొక్కలను ఉంచి ప్రత్యేక పూజలు చేశారు. స్థానిక శివాలయం రోడ్డులోని సర్వ మంగళ రామలింగేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో ఉన్న ప్రసన్నాంజనేయస్వామి ఆలయంలో హనుమన్ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి.

అల్లవరం: కొమరగిరిపట్నం పంచారామ క్షేత్రంలో కొలువైయున్న శ్రీమృత్యుంజయ హనుమాన్ జయంతి వేడుకలు శనివారం అత్యంత వైభవంగా జరిగాయి. మొగళ్లమూరు సెంటర్లో కొలువైన ప్రసన్నాంజనేయ స్వామి ఆలయంలో హనుమాన్ జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి తమలపాకులతో పూజ నిర్వహించి భక్తులకు అన్నప్రసాదాలు పంపిణీ చేశారు.



యానాంలో అభయాంజనేయస్వామి విగ్రహం వద్దకు ర్యాలీగా వచ్చిన భక్తులు

యానాం: పట్టణంలో రాష్ట్రీయ స్వయం సేవక్(ఆర్ఎస్ఎస్) ఆధ్వర్యంలో స్థానిక శివాలయం నుంచి బైపాస్ రహదారిలోని అభయాంజనేయస్వామి విగ్రహం వద్దకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా హనుమాన్ చాలిసాను పఠించారు. అదేవిధంగా స్థానిక శివాలయం ఆవరణలో ఉన్న ఆంజనేయస్వామివారి విగ్రహం వద్ద అధిక సంఖ్యలో భక్తులు విశేష పూజలు నిర్వహించారు. అర్చకులు పెద్దింటి నరసింహాచార్యులు పాల్గొన్నారు.

మాయా మంత్రాల్లేవు... అంతా సైన్స్ పరిజ్ఞానమే

అమలాపురం టౌన్: మాయలు, మంత్రాలు అనేవి మనిషి నమ్మకాలు మాత్రమేనని, ఉన్నదంతా సైన్స్ పరిజ్ఞానమేనని జన విజ్ఞాన వేదిక(జేవీవీ) రాష్ట్ర ఉపాధ్యక్షుడు కేవీవీ సత్యనారాయయణ అన్నారు. స్థానిక సూర్యనగర్‌లోని గోపాలకృష్ణ గోఖలే మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థులకు జేవీవీ జిల్లా శాఖ ఆధ్వర్యంలో శనివారం జరిగిన వేసవి వినోదం కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. జేవీవీ ద్వారా వేసవి వినోదం పేరుతో శాస్త్రీయ అంశాల ప్రదర్శనతో మూఢ నమ్మకాలను విడనాడే ప్రక్రియ నిర్వహిస్తున్నామని ఆయన చెప్పారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్ జిల్లా తిరువూరుకు చెందిన ఇంద్రజాలికుడు కమిడి పాపారావు సైంటిఫిక్ మ్యాజిక్ షో నిర్వహించారు. నిప్పు లేకుండా మంట మండించడం, చిత్తు కాగితాలను రూపాయి నోట్లుగా మార్చడం, సబ్బు నురగను మండించడం వంటి ప్రదర్శనల్లో సైన్స్ ఎలా దాగి ఉందో ప్రయోగాత్మకంగా వివరించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎన్.గంగరాజు, ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కదలి సత్యనారాయణ, యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు పి.వెంకటేశ్వరరావు, పెన్షనర్ల అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు సత్యనారాయణ, గోపాలకృష్ణ, ఎస్ఆర్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



సైంటిఫిక్ మ్యాజిక్ షో ప్రదర్శిస్తున్న ఇంద్రజాలికుడు పాపారావు

ఉదయం 8 గంటలకే ఓట్ల లెక్కింపు ప్రారంభం

ముమ్మిడివరం: ఈ నెల 4వ తేదీన ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియ ఉదయం 8 గంటలకే ప్రారంభమవుతుందని ముమ్మిడివరం అసెంబ్లీ నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి వి.మదన్‌మోహన్‌రావు తెలిపారు. ముమ్మిడివరం నగర పంచాయతీ కార్యాలయ సమావేశ మందిరంలో శనివారం ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. ఈ నెల 4న శ్రీనివాస ఇంజినీరింగ్ కళాశాలలోని స్వామి వివేకానంద సెమినార్ హాల్‌లో ఓట్ల లెక్కింపు ప్రక్రియ పోస్టల్ బ్యాలెట్ ఓట్లతో ప్రారంభమతున్నామన్నారు. నిర్దేశిత సమయానికి లెక్కింపు ప్రక్రియ ప్రారంభించేలా ఉదయం 7.30 గంటలకే ట్రంకు బాక్సులను కేంద్రాలకు తరలించేలా చర్యలు చేపట్టమన్నారు. పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియ 8.30 గంటలకు పూర్తి చేయాలని, అనంతరం ఈవీఎంల ఓట్ల లెక్కింపు ప్రారంభించాలని ఎన్నికల ఉన్నతాధికారులు సూచించారని చెప్పారు. ఒక రౌండుకు 14 టేబుల్స్ ఏర్పాటు చేస్తామన్నారు. 19 రౌండ్లకు 266 పోలింగ్ స్టేషన్ల ఓట్ల లెక్కింపు పూర్తవ్వగా మిగిలిన రెండు పోలింగ్ స్టేషన్లు 20వ రౌండులో పూర్తవుతాయన్నారు. ఒక రౌండు పూర్తవ్వడానికి 30 నిమిషాలు పడుతుందన్నారు. లెక్కింపు ప్రక్రియ సక్రమంగా జరిగిందా లేదా అని పరిశీలించిన తరువాతే ఫలితం ప్రకటిస్తామని చెప్పారు. ఓట్ల లెక్కింపు ప్రక్రియ మధ్యాహ్నం 3 గంటలకు పూర్తవుతుందని అంచనా వేస్తున్నామన్నారు. అనంతరం రాండమైజేషన్ పద్ధతిలో ఎంపిక చేసిన 5 వీవీప్యాట్ మిషన్లలోని స్లిప్సను నిర్ధారణ కోసం లెక్కిస్తామన్నారు. అనంతరం వాటికి ప్యాకింగ్, సీలింగ్ ప్రక్రియను పూర్తి చేసి గోదాములకు తరలిస్తామని చెప్పారు.



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న ఆర్వో మదన్‌మోహన్‌రావు

నాడు-నేడు పనులు వేగవంతం చేయండి

కాట్రేనికోన: మన బడి నాడు-నేడు పనులను వేగవంతం చేయాలని సమగ్ర శిక్ష అదనపు ప్రాజెక్టు కోఆర్డినేటర్ ఎ.మధుసూదనరావు సూచించారు. మండలంలోని లచ్చిరాజుచెరువు, కుంచనపల్లి, పల్లిపాలెం, బొజ్జావారిపేట, దొంతికుర్రు, చింతలమెరక, గచ్చుకాయలపొర గ్రామాల్లోని పలు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలు, జెడ్పీ ఉన్నత పాఠశాలలను ఆయన శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. కొన్ని పాఠశాలల్లో పనుల ఆలస్యానికి గల కారణాలను మండల విద్యాశాఖాధికారి టి.సుబ్రహ్మణ్యంను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మధుసూదనరావు మాట్లాడుతూ జూన్ 12న పాఠశాలలు పునః ప్రారంభం కానున్న నేపథ్యంలో ఈలోపే పనులు పూర్తి చేయాలన్నారు. అదనపు తరగతి గదులు, టాయిలెట్స్, మేజర్ అండ్ మైనర్ పనులు, కిచెన్ షెడ్ తదితర పనులను వేగంగా చేయాలన్నారు. ఎప్పటికప్పుడు పనుల ప్రగతిని ఆన్‌లైన్ చేయాలన్నారు. ఆయన వెంట సమగ్ర శిక్షా కమ్యూనిటీ మొబలైజేషన్ ఆఫీసర్ బీవీవీ సుబ్రహ్మణ్యం, సీఆర్ఎంటీ మంత్రిప్రగడ శ్రీనివాస్ ఉన్నారు.



నాడు-నేడు పనుల ప్రగతిని పరిశీలిస్తున్న ఏపీసీ మధుసూదనరావు

ముగిసిన వేంకటేశ్వరుని కల్యాణ మహోత్సవాలు

అమలాపురం రూరల్: మండలంలోని బండారులంక బిళ్లవారి వీధిలో వేంచేసియున్న పద్మావతి, అలివేలు మంగ సమేత వేంకటేశ్వర స్వామివారి కల్యాణ మహోత్సవాలు శనివారంతో ముగిశాయి. ఈ సందర్భంగా స్వామివారి కలశ నిమజ్జనం ఘనంగా నిర్వహించారు. బిళ్లవారి వీధి నుంచి ప్రారంభమైన కలశ నిమజ్జన పల్లకీ సేవ ఎగ్జిబిషన్ స్ట్రీట్, వీరభద్రస్వామి గుడి సెంటర్ మీదుగా శివాలయం వీధి వరకూ సాగింది. అప్పర్ కౌశికలో కలశాన్ని నిమజ్జనం చేశారు. శ్రీనివాస బాలమిత్ర సంఘం ఆధ్వర్యంలో శనివారం పది వేల మందికి మహా అన్న ప్రసాద వితరణ జరిగింది. కార్యక్రమంలో ఎంపీటీసీ అంకం హిమ భారతి, ఉప సర్పంచ్ కామిశెట్టి శ్రీనివాసరావు, దంగేటి బుల్లబ్బులు, ఊటుకూరి సుబ్రహ్మణ్యస్వామి, బాసిన శివన్నారాయణ, మట్టపర్తి శేఖర్, గ్రంధి బాలాజీ, బొక్కా ఆది నారాయణ, ఉప్పుగంటి భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.



స్వామివారిని పల్లకీలో ఊరేగిస్తున్న భక్తులు

ప్రభుత్వ ఐటీఐలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

యానాం: స్థానిక నేతాజీ సుభాష్ చంద్రబోస్ ప్రభుత్వ ఐటీఐలో వివిధ ట్రేడుల్లో ప్రవేశానికి అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ చింతపల్లి కృష్ణ సుధాకర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏడాది కోర్సులైన కంప్యూటర్ ఆపరేటర్ అండ్ ప్రోగ్రామింగ్ అసిస్టెంట్, ఫ్యాషన్ డిజైన్ అండ్ టెక్నాలజీ, రెండేళ్ల కోర్సులైన ఫిట్టర్, ఎలక్ట్రానిక్స్, మెకానిక్, ఎలక్ట్రీషియన్ ట్రేడుల్లో శిక్షణ ఉంటుందన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు లేబర్.పీవై.జీఓవీ.ఇన్, అదేవిధంగా సెంటాక్‌పుదుచ్చేరి.ఇన్ వెబ్‌సైట్‌ల ద్వారా ఈ నెల 30లోగా తమ దరఖాస్తులను పంపాలన్నారు. మరిన్ని వివరాలకు 0884-2951001, 9491441164 ఫోన్ నెంబర్లలో సంప్రదించాలని కోరారు.

ఈదురుగాలుల బీభత్సం

- నేలకొరిగిన చెట్లు, విద్యుత్ స్తంభాలు
- పలుచోట్ల విద్యుత్ సరఫరాకు ఆటంకం

యానాం: నియోజకవర్గ పరిధిలో శనివారం తెల్లవారుజామున కురిసిన భారీ వర్షానికి తోడు ఈదురుగాలులు బీభత్సం సృష్టించాయి. పలుచోట్ల కొబ్బరి చెట్లు, విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. మరికొన్ని విద్యుత్ తీగలపై పడటంతో రోజంతా విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. ప్రధానంగా కురసాంపేట నుంచి దరియాలతిప్ప, గిరియాంపేట, సావిత్రినగర్ వెళ్లే రహదారిలో పలుచోట్ల చెట్లు నేలకొరిగాయి. అదేవిధంగా హెచ్‌టీ విద్యుత్ తీగలపై పడటంతో తీర గ్రామాల్లో విద్యుత్ నిలిచిపోయింది. విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో నేలకొరిగిన చెట్లను యంత్రాల సహాయంతో తొలగిస్తున్నారు. అదేవిధంగా పట్టణ పరిధిలో రాజీవ్ రివర్‌బీచ్ వద్ద ఏర్పాటుచేసిన ఎగ్జిబిషన్ స్టాల్స్, హోర్డింగ్స్, రేకులు నేలకూలాయి. ఆర్ఏఓ ఆఫీసు వద్ద, ఎస్‌టీపీపీ ప్రభుత్వ జూనియర్ కాలేజీ వద్ద భారీ వృక్షాలు కుప్పకూలిపోయాయి. భారీ వర్షానికి న్యూబస్టాండ్‌కు వెళ్లే దారి ముంపుబారిన పడడంతో ప్రయాణికులు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

ముమ్మిడివరం: మండలంలో శనివారం తెల్లవారుజామున ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. మండలంలో శనివారం 25.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. సుమారు 100కు పైగా కొబ్బరి చెట్లు నేలకొరిగాయి. వివిధ ప్రాంతాల్లో విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు ధ్వంసమవ్వడంతో పాటు విద్యుత్ తీగలు తెగిపడ్డాయి. దీంతో అనేక గ్రామాల్లో విద్యుత్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది.

ఐ.పోలవరం: మండలంలో శనివారం తెల్లవారుజాము నుంచి ఎడతెరిపి లేకుండా కురిసిన భారీ వర్షానికి పలు గ్రామాల్లో చెట్లు నేలకొరిగాయి. అనేకచోట్ల విద్యుత్ స్తంభాలు విరిగి పడడంతో పాటు విద్యుత్ తీగలు తెగిపోయాయి. విద్యుత్ శాఖాధికారులు మండలంలోని ఐ.పోలవరం, మురమళ్ల, గుత్తినదీవి సబ్‌స్టేషన్ల పరిధిలోని వివిధ గ్రామాల్లో నేలకూలిన విద్యుత్ స్తంభాల స్థానంలో కొత్తవి తీసుకొచ్చి ఏర్పాటు చేస్తున్నారు. ఇప్పటికే పలు గ్రామాల్లో విద్యుత్‌ను పునరుద్ధరించారు. అయితే ఆదివారం నాటికే పూర్తి స్థాయిలో విద్యుత్ సరఫరా చేయగలని అధికారులు చెబుతున్నారు. రహదారులపై పడిన చెట్లను పంచాయతీ అధికారులు, ఇతర శాఖాధికారులు తొలగిస్తున్నారు.



సీహెచ్ గున్నేపల్లిలో విరిగిపడిన కొబ్బరి చెట్టు

ఉప్పలగుప్తం: మండలంలో శనివారం ఉదయం గాలివాన బీభత్సం సృష్టించింది. పెద్ద ఎత్తున వీచిన సుడిగాలులతో పలు గ్రామాల్లో కొబ్బరిచెట్లు, కరెంట్ స్తంభాలు నేలకొరిగాయి. చెట్లు విరిగిపడి రహదారులకు అడ్డంగా పడిపోయాయి. దీంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఉప్పలగుప్తం సబ్‌స్టేషన్ పరిధిలో 27 విద్యుత్ స్తంభాలు పడిపోయి విద్యుత్ తీగలు తెగిపడ్డాయి. దీంతో ఉప్పలగుప్తం సబ్‌స్టేషన్ పరిధిలో ఉదయం నుంచి విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. మండలంలో 25.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.



మురమళ్లలో కుప్పకూలిన కొబ్బరి చెట్టు, తెగిన విద్యుత్ తీగలు



చల్లపల్లిలో ఈదురు గాలులకు నేలకొరిగిన తాటాకిల్లు



యానాం జూనియర్ కాలేజ్ వద్ద నేలకొరిగిన చెట్టు



రాజీవ్‌బీచ్‌లో కూలిపోయిన ఎగ్జిబిషన్ హోర్డింగ్‌లు



భీమనపల్లిలో ఓ ఇంటిపై పడిన కొబ్బరిచెట్టు